క్లుప్తంగా

హెచ్‌ఐవీపై అవగాహన తప్పనిసరి

● డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: యువతకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో హెచ్‌ఐవీ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువజనోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 5 కిలోమీటర్ల రెడ్‌రన్ ఈనెల 9న విజ్జి స్టేడియంలో ఉదయం 6 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ సూర్యనారాయణ, డీఎంఓ మణి, ఎపిడిమాలజిస్ట్ వెంకటేష్, డీపీహెచ్‌ఎన్‌ఓ సత్యవతి, డాక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు..



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావాడ పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన కుళాయి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో చాలా మంది తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, వాసుబాబు, సీతంనాయుడు, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న గదల బంగారమ్మ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో వైఎస్సార్ బీమా కింద మంజూరైన తక్షణ సహాయాన్ని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామానికి చెందిన గాలి సీతమ్మ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన 90 వేల రూపాయలను త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మొయిద అక్కోజీరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూపూర్ణ జంక్షన్ వద్ద గురువారం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చేయూత అందించే క్రమంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఉన్నటువంటి తనకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పదవిని అప్పగించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని చెప్పారు. తనకు వస్తున్న జీతంలో కొంతభాగం ప్రజా సేవకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ రెల్ల జానకిరామ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ్, సంస్థ వలంటీర్స్ గణేష్ కుమార్, జగన్మోహన్, మాధవ రెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
● 18వ డివిజన్‌లో రూ. 28 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 18వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభోత్సవాలు చేశారు. బుక్కావీధి, నూతివీధి, హుకుంపేట ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. అంతకుముందు కోలగట్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లయాయాదవ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 18వ డివిజన్‌లో పర్యటిస్తున్న సమయంలో స్థానికుల కోరిక మేరకు రూ.28 లక్షలతో రహదారులు ఏర్పాటు చేసి, ఇప్పుడు ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు.. నిధులతో రహదారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేపట్టారన్నారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం కోలగట్ల గొప్పతనమని కొనియాడారు. గతంలో తమ ప్రాంతంలో తాగునీటికి అనేక ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. మరోసారి శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ లంక వరలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కాళ్ల సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లా రామకృష్ణ, డివిజన్ ఇన్‌చార్జ్ దేశెట్టి మోహన్, లంక నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మారిన రూపురేఖలు..



గతంలో పెదతాడివాడ పంచాయతీ కార్యాలయ భవనం



నూతనంగా నిర్మించిన పెదతాడివాడ సచివాలయ భవనం



పెదతాడివాడ సచివాలయంలోని లోపల భాగం

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారాయి. పెదతాడివాడ పంచాయతీ కార్యాలయాన్ని చిన్న భవనంలో నిర్వహించేవారు. ఈ భవనంలో విధులు నిర్వహించేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రూ. 40 లక్షలతో నూతన సచివాలయ భవనం నిర్మించారు. భవనం లోపల కూడా కార్పొరేట్ తరహాలో మౌలిక వసతులు కల్పించడంతో, ఆహ్లాదకర వాతావరణంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఈఈ సరిత, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములనాయుడు

● పర్యావరణ ఇంజినీర్ సరిత

విజయనగరం రూరల్: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణే మార్గమని, ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి విజయనగరం పర్యావరణ ఇంజనీర్ (ఈఈ) బీబీ సరిత పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛ గాలి (ఎన్‌సీపీఏ) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి విజయనగరం ప్రాంతీయ కార్యాలయం, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలాజీ జంక్షన్ నుంచి గంట స్తంభం, కోట వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఈఈ సరిత, మున్సిపల్ కమిషనర్ శ్రీరాముల నాయుడు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, చెట్లను నరకరాదని తెలిపారు. వాయు కాలుష్య నియంత్రణకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, పట్టణ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కాంతారావు

విజయనగరం ఫోర్ట్: విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు అన్నారు. స్థానిక బీసీ కాలనీలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ అమలుపై ఆరా తీయడంతో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో పోషక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా అదనపు భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రక్తహీనత రాకుండా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పేద విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్యాకానుక వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయకుమారి, ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుమీరా, సీడీపీఓ ప్రసన్న, సూపర్‌వైజర్ బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ సమస్యలు పరిష్కరించండి

● ఏపీ రైతు సంఘం వినతి



వినతిపత్రం అందుకుంటున్న ఆర్డీఓ ఎంవీ సూర్యకళ

విజయనగరం అర్బన్: ఎస్.కోట నియోజకవర్గం ప్రాంతాల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 516 కోసం సేకరిస్తున్న భూమి వ్యవహారంలో ముందుగా ఎదురైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు ఆర్డీఓ ఎంవీ సూర్యకళను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్.కోట నియోజకవర్గంలో కొత్తవలస, ఎల్.కోట, వేపాడతో పాటు మరికొన్ని గ్రామాల మీదుగా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వేయడం రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. మెజారిటీ రైతుల ఆమోదం తెలుసుకోకుండా నోటిఫికేషన్ ఇచ్చి 21 రోజుల్లో అభ్యంతరాలు తెలియజేయాలనడం సరైన పద్ధతి కాదన్నారు. రైతు సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామకృష్ణ, దేగల అప్పలరాజు, జి.వెంకటరావు, చిన్నారావు, వై.వెంకటరావు, సోమినాయుడు, సన్యాసినాయుడు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

విజయనగరం ఫూల్‌బాగ్: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ మాధవి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ ధర్నాకు ఎన్జీఓ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు బి. రాజగోపాల్, బీహెచ్ఆర్ ప్రభూజీ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం రోజురోజుకీ పనిభారం పెంచి ఉద్యోగులను ఆందోళన గురి చేస్తోందన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించాల్సిన మెడికల్ ఉద్యోగులు యాప్‌ల పేరుతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎటువంటి ట్రైనింగ్ లేకుండా యాప్‌లు ఇచ్చి ఆన్‌లైన్ వర్క్ చేయమంటే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహ అధ్యక్షుడు సీహెచ్ రమాదేవి, కోశాధికారి ధనుంజయ్ పట్నాయక్, డి. రమాదేవి, దుర్గా, రమాదేవి, కళావతి, పూర్ణ, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

● వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ: వరిసాగులో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె. తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని గుంపాం, కుమిలి గ్రామాల్లో వరిసాగులో నీటి యాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమపోటు రాకుండా వరిసాగులో పాయలు తీయాలన్నారు. రైతుశిక్షణ కేంద్రం ఎ.డి చంద్రశేఖర్‌బాబు మాట్లాడుతూ.. వరిసాగులో నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. నీలిమ, సర్పంచ్ ఎడ్ల ఆదిలక్ష్మి, గ్రామ వైస్ సర్పంచ్ జి. సురేష్‌రెడ్డి, ఆదర్శరైతు గాబు సూరప్పన్నరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కృష్ణుడి జీవితం అందరికీ ఆదర్శం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నెల్లిమర్ల రూరల్: అలుగోలు గ్రామంలో ఉట్టిని కొట్టేందుకు ప్రయత్నిస్తున్న చిన్నారి



నెల్లిమర్ల: శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు



విజయనగరం రూరల్: నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



విజయనగరం రూరల్: పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు దంపతులు, కుటుంబసభ్యులు

విజయనగరం: కృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆయన చెప్పిన జీవిత సత్యాలను అందరూ అర్థం చేసుకుంటే జీవితంలో ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కొనే శక్తి వస్తుందని చెప్పారు. కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గాజులరేగలోని యాదవ వీధి, కొత్తపేట రాధాకృష్ణ కల్యాణమంటపంలో అయా యాదవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్ముని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ... శ్రీకృష్ణుడి అజరామరమైన బోధనలు అన్ని తరాలకూ స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పారు. మన కర్తవ్యాన్ని నిజాయతీగా, చిత్తశుద్ధితో నిర్వర్తించడానికి ప్రేరణ నింపుతాయని తెలిపారు. కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఫ్లోర్‌లీడర్ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, నాయకులు గదుల సత్యలత, పాల్గొన్నారు.

వైభవంగా..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యాదవ సామాజికవర్గం శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి సంబరాలు చేపట్టారు. సంప్రదాయబద్ధంగా శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద తప్పెటగుళ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, తదితరులు శ్రీకృష్ణుడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో అలరించారు. ఉట్టిని కొట్టే కార్యక్రమంలో యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండోరోజు..

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రెండోరోజు కూడా కొనసాగాయి. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట, స్థానిక తెలకలవీధికాలనీలో సంబరాలు నిర్వహించారు. జరజాపుపేట నాయుడువీధి కాలనీలో ఉట్టి కొట్టే సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

రామనారాయణంలో ..

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కృష్ణం వందే జగద్గురుం నృత్య రూపకం భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ఇంట..

విజయనగరం రూరల్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇంట రోహిణి నక్షత్రం అష్టమి గడియలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పూజను వైభవంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సతీమణి మజ్జి పుష్పాంజలి, కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. జిల్లా ప్రజలపై శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

టీటీడీ ఆధ్వర్యంలో...

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ చేపట్టారు. గోమాతను పూజించడం వల్లసకల సౌభాగ్యాలు కలుగుతాయని టీటీడీ ప్రొగ్రాం అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ.నరసింహాచార్యులు, భక్తమండలి సభ్యులు జి.తిరుపతిరావు, ఎస్.రంగారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణుడి వేషధారణలు..

విజయనగరం టౌన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక కమ్మవీధిలో ఉన్న సేవా కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ, బీకే మాధురి, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆయలంలో..

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉపాలయంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతద్రవ్యాలతో అభిషేకాలు చేసిన తర్వాత వివిధ రకాల పుష్పాలు, తులసిమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం విశేష అర్చనలు, నీరాజనం, మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశాలివీధిలో..

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పద్మశాలివీధిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు ఉట్టికొట్టడానికి పోటీపడ్డారు. చిన్నారుల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో కానూరి లక్ష్మి, పిన్నింటి గీత, పందిరి లక్ష్మి, ఆలేటి దేవి, తదితరులు పాల్గొన్నారు.

జోగిరాజుపేటలో ...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట శివాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కోలాటాలు, భజనల నడుమ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో గుషిణి ఎంపీటీసీ సభ్యురాలు చనమళ్ల స్వాతి, నాయకులు మత్స శ్రీను, గోవింద, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



విజయనగరం టౌన్: గోపూజ నిర్వహిస్తున్న టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యులు, భక్తులు



విజయనగరం టౌన్: విచిత్ర వేషధారణల పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో బీకే అన్నపూర్ణ, తదితరులు



పూసపాటిరేగ: కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న చిన్నారులు



నెల్లిమర్ల రూరల్: శ్రీకృష్ణుడి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు